www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 32 నవంబర్ 2024
5
తిరుపతి



ఈఎస్ఐ మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శ్యాంబాబు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలో వున్న కార్మిక రాజ్య బీమా (ఈ. ఎస్. ఐ) ఆసుపత్రికి నూతన మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్. మల్చి శ్యాంబాబు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ డెప్యూటేషన్ పై (సూళ్లూరుపేట డి. సి. ఆసుపత్రి నుండి)ఆర్థోపెడిక్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ గా పనిచేస్తున్న డాక్టర్. శ్యాంబాబు ను.. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు.. తిరుపతి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ గా కొనసాగుతారని రాష్ట్ర బీమా వైద్య శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వారిది రెక్కాడితే గాని డొక్కాడని బతుకు.. రాయలసీమ జిల్లాల్లో గత మూడేళ్లుగా కరువు రక్కసి తాండవించడంతో వేసిన పంట చేతికి రాక, అప్పు తీర్చుకునేందుకు బెంగుళూరు, తిరుపతి, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లిన వలస కూలీల పరిస్థితి దయనీయం. పండగ పూట కూడా కూలికి పోతేనే వారికి నాలుగు వేళ్లు నోట్లోకి పోయేది. కర్నూలు, అనంతపురం, హిందూపురం జిల్లాల్లో వరుసగా కరువు రావడంతో అక్కడ బతకలేక పొట్ట చేతబట్టుకుని, మూటాముల్లు సర్దుకుని తిరుపతికి వలసొస్తుంటారు.. పంట వేయడం, పెట్టుబడి కూడా రాకపోవడం, అప్పు తీర్చుకునేందుకు వలస వెళ్లడం వీరికి షరామామూలే.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రభుత్వాలు కరువును పారదోలలేకపోయాయి. వరుణుని నమ్ముకుని జొన్న, సజ్జ, పత్తి, శనగ పంట వేసిన రైతులు పంట కోసం చేసిన అప్పు చేతికి రాకపోవడంతో ఊళ్లో ఉంటే చావే శరణ్యమని వృద్ధులను, పిల్లలను ఇళ్ల దగ్గర వదిలేసి వలసొచ్చేశారు. మూడేళ్లుగా వీరిది ఇదే జీవన విధానం. బెంగుళూరులో ఐటి పరిశ్రమ గత కరోనా కాలం నుంచి 'వర్క్ ఫ్రం హోం' కావడంతో ఎక్కువమంది ఇళ్ల వద్దను ఐటి ఉద్యోగులు సొంతూళ్లల్లోనే పనులు చేసుకుంటున్నారు. దీంతో భవన నిర్మాణ పనులు మందగించాయి. హైదరాబాద్‌లోనూ అదే పరిస్థితి. ఇపుడిపుడే అభివృద్ధి జరుగుతున్న తిరుపతిలో భవన నిర్మాణ పనులు ఊపందుకోవడంతో రాయలసీమ పరిధిలోని కూలీలు హిందూపురం, ఉరవకొండ, ధర్మవరం, తాడిపత్రి, డోన్, ఆదోని, ఆత్మకూరు నియోజకవర్గాల నుంచి వలసొచ్చారు. భవన నిర్మాణ మేస్త్రికి రోజుకు వెయ్యి రూపాయలు కూలి దక్కుతుంది. అయితే తాము పొట్ట నింపుకునేందుకు వలస రావడంతో చులకనగా కేవలం 700 మాత్రమే చేతిలో పెడుతున్నారని వలస కార్మికులు వాపోతున్నారు. ఇటుకలు, సిమెంట్, ఇసుక మోసేందుకు సిద్ధమవుతున్నారు. తిరుపతిలోని నాలుగుకాళ్ల మండపం, ఇందిరా మైదానం, లీలామహల్ సర్కిల్, ఎంఆర్‌పల్లి సమీపంలోని వైకుంఠపురం ఆర్చి వద్ద పనుల కోసం గంటల తరబడి ఉదయం 4 గంటల నుంచే వేచి ఉంటారు. ఈ నాలుగు ప్రాంతాల్లో దాదాపు 4వేల మందిపైనే కూలీలు పనుల కోసం బిల్డర్లను, బిల్డింగ్ యజమానులను అభ్యర్థించడం 'ప్రజాశక్తి'కి కనిపించింది. మహిళకు సాధారణ డిమాండ్ రోజుకు 700. అయితే టిఫిన్, అన్నం తామే తెచ్చుకుంటామని, 500 ఇచ్చినా చాలని అభ్యర్థించడం గమనార్హం. ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకూ ఈ కూలీలు పనుల కోసం నిరీక్షిస్తూ ఉంటారు. పని దొరక్కపోతే ఇంటిమొహం పడతారు. వీరి మధ్య ఉండే పోటీతో యజమానులు అతి తక్కువ కూలికి వీరిని మాట్లాడుకుంటూ ఉంటారు.

మేం ఏం పాపం చేశాం : ప్రశాంత్‌కుమార్, మేస్త్రి సహాయకుడు, డోన్, కర్నూలు జిల్లా

నేను డిగ్రీ చదువుకున్నా. ఉద్యోగం రాలేదు. ఉన్న రెండు ఎకరాల్లో సజ్జ పంట వేశా. వర్షాల్లేక పంట ఎండిపోయింది. మా నాన్న, అమ్మ ముసలివారు. నాకు కొత్తగా పెళ్లయ్యింది. పెళ్లికోసం అప్పులు చేశా. పంట కోసం అప్పు చేశా. ఐదు లక్షలు అప్పు తేలింది. వడ్డీ చెల్లించేందుకూ కొత్తగా పెళ్లయిన నా భార్యను పనికి తీసుకెళుతునా. తిరుపతిలో సహాయ కూలీలుగాపనిచేస్తున్నాం. మాకు రోజుకు రూ.1200 వస్తుంది. 500 రూపాయలతో తిని, 700 మిగలబెట్టి ఐదు లక్షలకు వడ్డీ కడుతున్నాం. అసలు ఎప్పుడు తీరుతుందో ఆ ఏడుకొండల స్వామికే ఎరుక.

5ఎకరాల జొన్న పంట నష్టపోయా : గోకార్, కర్నూలు జిల్లా ఆదోని

నిరంతరం మా ప్రాంతానికి కరువు తాండవిస్తూనే ఉంది. రైతు బతికే పరిస్థితి లేదు. దీంతో ప్రత్యామ్నాయంగా మేస్త్రి పని నేర్చుకున్నా. ఐదు ఎకరాల పొలం ఉంది. దాదాపు 60వేలు ఖర్చు చేసి జొన్న పంట వేశా. వర్షాలు సకాలంలో పడకపోవడంతో పంట ఎండిపోయింది. మా పొలంలో ఆవులను మేపేశా. గత మూడేళ్లుగా చేసిన అప్పు రెండు లక్షలు కావడంతో వడ్డీ కట్టలేక, బిడ్డలను, వృద్ధులను పోషించుకోలేక ప్రవృత్తిగా నేర్చుకున్న మేస్త్రి పని కోసం భార్యాపిల్లలతో తిరుపతికి వలసొచ్చా. ప్రస్తుతం గాంధీపురంలో 1500 ఇల్లు బాడుగకు తీసుకుని ఉంటున్నా. తాను, తన భార్య ఇద్దరం పనిచేసే రోజుకు 1500 కూలి వస్తుంది. ఎంఆర్‌పల్లి సమీపంలోని వైకుంఠపురం ఆర్చి వద్ద పని దొరికితే సరి. లేదంటే పస్తులే. ప్రభుత్వాలు హామీలిస్తూనే ఉన్నాయి తప్ప, కరువు కాటకాలను పారదోలడంలో విఫలమయ్యాయి.

6న టిటిడి పాలకమండలి ప్రమాణస్వీకారం

ఒకేరోజు ఛైర్మన్ సహా 15మంది సభ్యులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక బిజెపి, టిడిపి, జనసేనతో కలిపి కొత్తగా టిటిడి పాలకకమండలి ఏర్పాటైన విషయం విదితమే. ఈనెల 6వ తేదీ బుధవారం ఉదయం 8 గంటలకు శ్రీవారి ఆలయంలో ఛైర్మన్ బి.రాజగోపాల్‌నాయుడుతో పాటు 15 మంది బోర్డు సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం అట్టహాసంగా ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చేస్తోంది. అదేరోజు మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణా, తమిళనాడు సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. టిటిడి ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఈవో శ్యామలరావు, దేవాదాయ శాఖ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, దేవాదాయ శాఖ కమిషనర్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. తుడా ఛైర్మన్ కూడా ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉంటారు. అయితే తుడా ఛైర్మన్‌ను ఇంకా కూటమి ప్రభుత్వం ప్రకటించలేదు. ప్రకటించినరోజే ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది. ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎం హాజరుకావాలని ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆహ్వానం పలికినట్లు తెలుస్తోంది. వీరిద్దరిలో ఒకరు ప్రమాణ స్వీకార మహోత్సవానికి విచ్చేస్తారని సమాచారం. కేంద్ర మంత్రి జెపి నడ్డా సైతం హాజరవుతారని తెలుస్తోంది.

పట్టుబట్టి సాధించిన భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలకమండలిని కూటమి ప్రభుత్వం బిఆర్ నాయుడుతో పాటు 24 మందిని సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జి.భానుప్రకాష్‌రెడ్డి తనదైన శైలిలో కేంద్రం నుంచి ఒత్తిడి తెచ్చి ఎట్టకేలకు బోర్డులో చోటు దక్కించుకున్నారు. నలుగురు ఎక్స్ అఫిషియో సభ్యులతో కలిపి 29 మంది కానున్నారు.

'ఉచిత గ్యాస్'తో వెలుగులు

ప్రజాశక్తి - రామచంద్రాపురం (పాకాల), యంత్రాంగం

రాష్ట్రంలోని మహిళల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని చంద్రగిరి శాసనసభ్యులు వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. పాకాల మండలం, దామలచెరువు పంచాయితీలో తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే నాని దీపం – 2 మొదటి ఉచిత సిలిండర్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల జీవితాలలో వెలుగులు నింపటానికి నాడు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు...... నేడు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేసి మహిళల పక్షపాతి గా నిలచారని పేర్కొన్నారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు నాయకులు, మహిళలు, యువత అపూర్వ స్వాగతం పలికారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చంద్రగిరి నియోజకవర్గంలో సుమారు 66 వేల మంది లబ్ధిదారులకు దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. పాకాల మండలంలో సుమారు 16 వేల 126 మంది లబ్ధిదారులకు దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి బైరాగిపట్టెడ మహాత్మాగాంధీ హైస్కూల్లో లబ్దిదారులకు ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు అందించారు. తిరుపతి నియోజకవర్గంలో 1,14,900 ఎల్‌పిజి కనెక్షన్లు ఉంటే అందులో 49వేల మందికి దీపం వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, శాప్ ఛైర్మన రవినాయుడు, వూకా విజయ్‌కుమార్, నరసింహయాదవ్ పాల్గొన్నారు.

తిరుపతి జిల్లాలో 6లక్షల కుటుంబాలకు లబ్ది

అక్కచెల్లెమ్మలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితమని, సూపర్‌సిక్స్ పథకం అమల్లో భాగంగా గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందించనున్నామని ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం అన్నారు. రాష్ట్రమంతా పండుగ వాతావరణంలో సిలిండర్ల పంపిణీని ఎన్డీయే కూటమి చేస్తుందన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పిచ్చాటూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉచిత సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ డి.ఇలంగోవరెడ్డితో కలిసి ఎంఎల్ఎ లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్యమంత్రికి వల్లియమ్మ, కోకిల, జ్యోతి, నాగమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు.

రామచంద్రాపురంలో మండల టిడిపి అధ్యక్షులు మేకల తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో కుప్పంబాదూరులో పంపిణీ చేశారు. మాజీ ఎంపిపి కేశవులునాయుడు, డిప్యూటీ తహాశీల్దార్ అన్వర్‌బాష పాల్గొన్నారు. గ్యాస్ పథకాన్ని ఈకేవైసి చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్.చిన్నబాబు, సి.జనార్ధన్‌చౌదరి పాల్గొన్నారు. పుత్తూరులో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి అంబేద్కర్ సర్కిల్లో పాలాభిషేకం చేశారు. రవినాయుడు, శ్రీజ బాలాజీనాయుడు, ధనపాల్ పాల్గొన్నారు. దొరవారిసత్రంలో ఎంపిడిఒ గోవర్ధన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. బిఎన్ కండ్రిగలో తహాశీల్దార్ ఐ.సుబ్రమణ్యం, మండల అధ్యక్షులు సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.

పుత్తూరులో ఎపి స్టేట్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు ఆధ్వర్యంలో ఉచిత సిలిండర్లను అందజేశారు. తహాశీల్దార్ జిసి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగింది.

పాకాలలో ఉచిత గ్యాస్ పంపిణీ

మెరుగ్గా పారిశుధ్య పనులు : కమిషనర్

తిరుపతి టౌన్ : పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. శుక్రవారం తెల్లవారుజామున లీలామహల్ జంక్షన్ వద్ద మస్టర్ గదుల వద్ద పారిశుధ్య కార్మికుల హాజరు నమోదును పరిశీలించారు. ఇంటింటి వద్ద చెత్త సేకరణ ఓ క్రమ పద్ధతిలో నిర్దిష్ట సమయంలో జరిగేలా చూడాలన్నారు. నైట్ స్వీపింగ్ రెగ్యులర్ చేయాలన్నారు. నగరంలో ఎక్కడా చెత్త కనబడకుండా సిబ్బంది పనిచేయాలన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. మధుకుమార్, శానిటరీ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి ఉన్నారు.

4న జీ తెలుగులో 'ఉమ్మడి కుటుంబం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ జీ తెలుగు మరో సరికొత్త సీరియల్ను తన అభిమానవీక్షకులకు అందించేందుకు సిద్ధమైంది. ఈనెల 4వ తేదీ ఉమ్మడి కుటుంబం సీరియల్ ప్రసారం జీ తెలుగులో విడుదల చేయనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ప్రదేవం పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల మధ్య అనుబంధం, అనురాగాల నేపథ్యంలో సాగే ఆసక్తికరమైన కథ, కథనంతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ 'ఉమ్మడికుటుంబం'. ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటలకు జీ తెలుగులో వస్తుంది.

రేపు వైసిపి జిల్లా అధ్యక్ష ప్రమాణ స్వీకారం

తిరుపతి టౌన్ : వైఎస్ఆర్ కాంగ్రెస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా భూమన కరుణాకర్‌రెడ్డిని నియమించారు. ఈనెల 3వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటలకు కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరిస్తారని, వైసిపి శ్రేణులు తరలి రావాలని ఎంపి గురుమూర్తి విజ్ఞప్తి చేశారు. రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి కె.విజయసాయిరెడ్డి, మాజీ సిఎం సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు హాజరుకానున్నారు. తిరుపతి – చిత్తూరు జాతీయ రహదారిలోని హోటల్ సరదన్‌స్పైస్ సమీపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు జిల్లాకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రాక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రైల్వేశాఖపై 'ఆన్ ది స్పాట్ స్టడీ టూర్' నిమిత్తం తిరుపతి జిల్లాకు రెండు రోజుల పర్యటనలో భాగంగా పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బృందం రానుంది. ఈ నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లను డిఆర్‌ఒ నరసింహులు నిర్వహించారు. మూడో తేదీ తిరుపతి జిల్లాకు ఎంపి రమేష్ సారథ్యంలో ఈ కమిటీ రానుంది. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ బృందం దురంతో ఎక్స్ప్రెస్ లో ఆదివారం సాయంత్రం 4.40 గంటలకు రేణిగుంట రైల్వేస్టేషన్ చేరుకుని, తిరుపతి తాజ్ హోటల్లో బస చేస్తుంది. 4న తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం తిరుపతి ఐల్వేషన్ అభివృద్ధిపై సమీక్షిస్తారు. అదేరోజు రాత్రి తిరుగు ప్రయాణం అవుతారు. ఆర్.డి.ఓ తిరుపతి రామ్మోహన్, డిఎంహెచ్‌ఒ శ్రీహరి, సూపరింటెండెంట్ రుయా ఆసుపత్రి రవి ప్రభు, డిసిహెచ్‌ఎస్ ఆనందమూర్తి ప్రోటోకాల్ తహసీల్దార్ కుప్పయ్య పాల్గొన్నారు.

రేణిగుంట బీసీ హాస్టల్లో దీపావళి సంబరాలు

ఆటపాటలతో దీపావళి వేడుక : జెవివి

ప్రజాశక్తి - రేణిగుంట

రేణిగుంట బీసీ హాస్టల్లో విద్యార్థులతో కలిసి దీపాలు వెలిగించి, ఆటపాటలతో దీపావళి పండుగను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. 'వుయ్ సపోర్టు ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ తహసున్నీసా బేగం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అణగారిన జీవితాల్లో అక్షరధారి పొద్దు పొడిచెను చదువుల జెండగా మారి అంటూ జ్యోతిరావుపూలే, సావిత్రిబాయ్ పూలే గేయాలను ఆలపించారు. రేణిగుంట పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు జబ్బర్ మాట్లాడుతూ బుద్ధుడు తిరిగి రాజ్యానికి వస్తున్నప్పుడు ప్రజలందరూ దీపాలతో ఆహ్వానం పలుకుతూ పండగ చేసుకున్న సందర్భం దీపావళి అయిందని, అదేవిధంగా శాంతి ,సహనం ,ధర్మం పద్ధతిలో ఆచరించాలని , ఉన్మాదం కూడదని తెలియజేశారు. క్విజ్ మాస్టారుగా బీటెక్ విద్యార్థి సునీల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరి, జయలక్ష్మి, నూర్జహాన్, మైక్రో బయాలజీ ప్రొఫెసర్ వెంకటేశ్వరులు, ప్రజానాట్యమండలి శెల్వరాజు, గిరిజన సంఘం హరినాథ్ వార్డెన్ వెంకటేష్ పాల్గొన్నారు. ఒ.వెంకటరమణ సంధాన కర్తగా వ్యవహరించారు.

'లో ఓల్టేజి'తో కరెంట్ ఇక్కట్లు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

లో ఓల్టేజితో కరెంట్ సమస్య తలెత్తుతోందని, మురుగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని రాచకండ్రిగ గ్రామస్తులు శుక్రవారం నిరసన తెలిపారు. బత్తులవల్లం పంచాయతీ రాచకండ్రిగలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల లో ఓల్టేజితో ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయన్నారు. అపార్టుమెంట్ల నుంచి మురుగునీటిని రాత్రివేళల్లో రహదారులపైకి వదిలేస్తుండడంతో దుర్వాసన భరించలేకపోతున్నామన్నారు. అధికారులకు అనేకమార్లు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో నిరసన తెలుపుతున్నట్లు చెప్పారు. శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్ అక్కడకు చేరుకుని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

రాచకండ్రిగ గ్రామస్తుల నిరసన

రూ.5 లక్షల విలువైన గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - తడ

మండలంలోని తడ రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న పార్కింగ్ ప్లేస్ వద్ద తమిళనాడు కు చెందిన నలుగురు గంజాయి స్మగ్లర్‌లను పట్టుకుని వారి వద్ద నుంచి 46 కిలోల గంజాయి, 3 సెల్ ఫోన్లు స్వాధీన పరచుకున్నారు. పోలీసు వారు అందించిన సమాచారం మేరకు... గురువారం సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు తిరుపతి ఎల్ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె రవి మనోహరాచారి సూచనల మేరకు నాయుడు పేట డి యస్ పి జి చెందుబాబు పర్యవేక్షణలో సుళ్ళూర్ పేట సీఐ యం మురళి కృష్ణ, తడ పోలీస్ స్టేషన్ యస్ ఐ కె కొండప్ప నాయుడుకు సమాచారం అందింది. తడ రైల్వే స్టేషన్ దగ్గర తనిఖీ నిర్వహించగా పార్కింగ్ ప్లేస్ వద్ద అనుమానాస్పదంగా రకరకాల బ్యాగులతో వున్న నలుగురిని తనిఖీ చేయగా వారివద్ద 46 కేజీల గంజాయి దొరికింది. ఎస్.రాజరాజన్ (40) అలియాస్ సంతోష్, తమిళ్‌మణి అలియాస్ అప్పు (21), మాధకోయిల్, పి.రమేష్ (39)ల నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 5 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

అమరజీవి త్యాగం మరువలేం

ప్రజాశక్తి - రేణిగుంట

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమర జీవి పొట్టి శ్రీరాములును ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరవరని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు అన్నారు.నవంబర్ 1 ఆంధ్ర రాష్ట్ర దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకుంటూ శుక్రవారం రేణిగుంట లోని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంస్థ కార్యదర్శి మునేంద్ర, ముఖ్య సలహాదారులు అమ్ములు రాజు, సూపర్వైజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ తనిఖీ

ప్రజాశక్తి - క్యాంపస్



క్రీడాప్రాంగణాల నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సును శాప్ ఛైర్మన్ శుక్రవారం తనిఖీ చేశారు. తొలుత స్పోర్ట్స్ కాంప్లెక్సులోని స్విమ్మింగ్ పూల్, టెన్నిస్ కోర్ట్, ఇండోర్ హాలు, స్కేటింగ్ రింగ్, వాకింగ్ ట్రాక్, మల్టీపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను ఆయన పరిశీలించారు. క్రీడాప్రాంగణంలో నెలకొన్న సమస్యలు, కాంప్లెక్సు నిర్వహణ పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన డీఎస్ఏ అధికారులకు సూచనలతోపాటు ఆదేశాలు జారీ చేశారు. స్విమ్మింగ్ పూల్ మెయింటెనెన్స్ లేకపోవడంతో అపరిష్కృతంగా తయారైందని, మరమ్మతులకు గురైందన్నారు. తక్షణమే స్విమ్మింగ్ పూల్ కు మరమ్మతులు చేపట్టాలని, విధిగా స్విమ్మింగ్ పూల్ ను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అవసరమైతే కలెక్టరు కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించి స్మార్ట్ సిటీ నిధులతో స్విమ్మింగ్ పూల్ అభివద్ధి పనులు చేపట్టాలన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన మల్టీపర్పస్ హాలు నిర్మాణానికి సంబంధించి మరోసారి అంచనాలను తయారుచేసి నిర్మాణపనులను పూర్తిచేసి ఖేలో ఇండియా హాస్టలుగా వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే స్కేటింగ్ రింగ్ లీజును రద్దుచేసి తిరిగి డీఎస్ఏకు అప్పగించాలని, దానికి సంబంధించి కోచ్ ను కూడా నియమించి క్రీడాకారులకు శిక్షణ ఇప్పించాలని సూచించారు. అలాగే వాకింగ్ ట్రాకును బాగుచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా స్పోర్ట్స్ కాంప్లెక్సులోని సమస్యలను పరిష్కరించి కాంప్లెక్సుకు పూర్వ వైభవం తీసుకురావాలని శాప్ ఛైర్మన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్డీఓ సయ్యద్ సాహెబ్, తిరుపతి టీడీపీ నగర అధ్యక్షుడు మహేష్ యాదవ్, టీడీపీ నాయకులు వివేక్ చౌదరి, హరికష్ణ యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో క్రీడలను ప్రోత్సహించండి : ఎస్ఎఫ్ఐ

తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్య సంస్థలలో క్రీడలను ప్రోత్సహించి ప్రభుత్వ విద్యాసంస్థలకు సంబంధించినటువంటి క్రీడా ప్రాంగణాలను కమర్షియల్ కార్యకలాపాలకు అనుమతి ఇవ్వకూడదని జీవో ఇవ్వాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడుకి ఎస్ఎఫ్ఐ నేతలు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఇటీవల శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం అధికారుల అత్యుత్సాహం వలన తారకరామ స్టేడియంను కమర్షియల్ కార్యక్రమాలకు ఇవ్వడం వల్ల అక్కడ ప్రశాంతంగా కూర్చున్నటువంటి విద్యార్థి నాయకులపై పోలీసుల దాడిని గురించి వివరించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం అధికారులకు కూడా తారకరామా స్టేడియంను ఎటువంటి కమర్షియల్ కార్యక్రమాలకు ఇవ్వకుండా శాప్ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి ఆఫీస్ బేరర్స్ అశోక్, వినోద్, నరేంద్ర, నాయకులు మధు, మనీష్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం నవంబర్ 1 తెల్లవారుజాము నుంచే ప్రారంభమయ్యింది. గూడూరు ఎంఎల్ఎ సునీల్‌కుమార్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుతో కలిసి లబ్దిదారులకు పెన్షన్ అందజేశారు. అర్హుల కలిగి పెన్షన్ రానివారు దరఖాస్తు చేసుకోవాలని, వచ్చేనెల ఒకటో తేదీ నుంచి వారికి పెన్షన్ అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇల్లులేని నిరుపేదలకు ఇంటి స్థలం కేటాయించడంతో పాటు ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం ద్వారా ఇల్లు నిర్మించుకునేందుకు నాలుగు లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. చెన్నూరులో టిడిపి మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లు అందజేశారు.

బుచ్చినాయుడు కండ్రిగ మండలం నెలవాయి పంచాయతీలో గీతాంజలి అనే వికలాంగురాలికి ఆరువేల రూపాయల పింఛన్ ఇవ్వాల్సి ఉంది. అయితే గీతాంజలి తిరుపతి రుయాలో ఆపరేషన్ చేయించుకుని ఉంది. దీంతో డిజిటల్ అసిస్టెంట్ సురేష్ రుయాకు వెళ్లి పింఛన్ అందించి మానవత్వం చాటుకున్నారు.

పారదర్శకంగా పింఛన్ల పంపిణీ

తిరుపతి జిల్లా పరిధిలో పారదర్శకంగా లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరిగిందని డిఆర్డిఏ పిడి శోభన్ బాబు తెలిపారు. జిల్లా పరిధిలో 2,65,488 లబ్ధిదారులు ఉన్నారని, ఇప్పటివరకు 96.36 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందన్నారు. కొన్ని గంటలపాటు సాంకేతిక లోపం తలెత్తడంతో పింఛన్ల పంపిణీ ఆలస్యమైందని, ఇంకను కొన్ని మండలాల పరిధిలో రాత్రి అయినా తనపల్లి, తిరుచానూరు, వెంకట రామాపురం ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ కొనసాగుతోందన్నారు.

జిల్లాలో 2,65,488మందికి లబ్ధి : కలెక్టర్

ఉదయం 6 గంటల నుండి పెన్షన్ల పంపిణీ ప్రారంభించి జిల్లాలో 2,65,488 మందికి 5295 మంది సచివాలయ సిబ్బంది ద్వారా రూ.112.37 కోట్ల పంపిణీకి చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఏదేని కారణం చేత పెన్షన్ల నేడు తీసుకోలేని వారికి నవంబర్ 2 వ తేదీన పంపిణీ చేయడం జరుగుతుందని, తప్పకుండా వారు వారి ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు.

పింఛన్ల పంపిణీలో...

రోడ్లపైనే పశువులు

- వాహనదారుల ఇక్కట్లు
- పంటలను ధ్వంసం చేస్తున్న వైనం
- రైతుల ఆందోళన
- బయటకు వదలొద్దని పోలీసుల హెచ్చరిక

రోడ్లపైనే గుంపులుగా వెళుతున్న పశువులు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: పశువులు పగలంతా పంటపొలాలపై పడి ఇష్టం వచ్చినట్లుగా మేసి ధ్వంసం చేస్తున్నాయి. రాత్రి వేళల్లో రద్దీగా వున్న రోడ్లపై రాత్రి వేళల్లో సంచారం చేస్తున్నాయి. దీని వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో చీకట్లో వాహనాలకు అడ్డంగా వచ్చి ఆందోళన కలిగిస్తున్నాయని ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం వుందని వాహన చోదకు లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులను రోడ్లపైకి వదలొద్దని స్థానిక పోలీసులు హెచ్చరిస్తున్నారు.

పంటలు ధ్వంసం

పశువులు పగలంతా పంట పొలాలను మేసి రాత్రి వేళల్లో రోడ్లపైకి చేరుతున్నాయి. అటు రైతుల పంటలను యథేచ్ఛగా మేస్తూ తొక్కి నాశనం చేస్తూ నష్టం కలిగిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో శ్రమకోర్చి రుణాలు చేసి పంటలు వేసుకుని తమ కష్టాలు కొంతైనా తీరుతాయని ఆశిస్తూ ఎదురుచూస్తున్న సమయంలో రైతన్నకు ఈ పశువుల వల్ల నిరాశే మిగులుతోంది. సుమారు 60 నుండి 70 పశువుల వరకు గుంపులుగా చేరి పంటలను మేసి తీవ్ర నష్టం కలిగిస్తున్నా యని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపైనే పశువుల సంచారం

ఇటు వాహన దారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో రాత్రి పొద్దు పోయే సరికి పోలీస్ స్టేషన్ ఆవరణ నుండి బజారు మీదుగా ఎక్కడ పడితే అక్కడ వందల కొద్ది పశువులు బజారులలో సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో అవి కనబడక ఎంతోమంది ద్విచక్ర వాహనాలు ఢీకొని నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. అంతే కాకుండా రాత్రి సమయంలో అపాచీ శ్రీ సిటీ లాంటి కంపెనీలకు వెళ్లే కార్మికులు రాత్రి సమయంలో ఒంటి గంటకు ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ఈ పశువుల మందలో వాటితో పాటు కుక్కల మందలు కూడా ఒకటవడంతో మండలంలోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పరిస్థితి ఇలా వుంటే పంచాయతీ అధికారులు ఏం చేస్తున్నారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అంతే కాకుండా బుచ్చినాయుడు కండ్రిగలో రాత్రి వేళల్లో వీధిలైట్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ లైట్లు లేక రాత్రి సమయంలో కటిక చీకటిలో ప్రభుత్వ కార్యాలయాలు ఉండడం ఎంతో విడ్డూరంగా వుందన్నారు. పశువుల మాట ప్రస్తావిస్తే రైతులు, వాహన దారులు హడలెత్తిపోతున్నారు. పశువుల కారణంగా ప్రమాదాలకు గురి అయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా పార్టపల్లి, బుచ్చినాయుడు కండ్రిగ గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో ఈ పశువుల మందలు చేరి వాహన చోదకులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. నిర్వాకోట ప్రాంతాలకు చెందిన పశువుల యజమానులు తమ పశువులను గురించి పూర్తిగా మర్చిపోయినట్టున్నారు. పంచాయతీ, యంత్రాంగం, ఇకనైనా స్పందించి పశువుల యజమానులతో మాట్లాడి రైతులను వాహనదారులను కాపాడవలసిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

బయటకు వదలొద్దని పోలీసుల హెచ్చరిక

పశువుల యజమానులు తమ పశువులను విచ్చలవిడిగా వదిలి వేస్తుండటంతో పగటి సమయంలో రైతులు, రాత్రి వేళల్లో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఇలా బయటకు వదలవద్దని స్థానిక పోలీసులు హెచ్చరిస్తున్నారు. అలా వదిలితే చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.

క్రైం న్యూస్

తమిళనాడులో హత్యమార్చి... ఆంధ్రాలో పూడ్చి..!

ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు మండలం ఆంధ్ర సరిహద్దు చెన్నేరి గ్రామానికి సమీపంలో తమిళనాడులో హత్యమార్చి గుట్టుచప్పుడు కాకుండా పూడ్చివేసిన యువకుడి మృతదేహాన్ని గురువారం ఆంధ్ర, అటు తమిళనాడు పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో వెలికి తీశారు. సత్యవేడు ఎస్ఐ రామస్వామి కథనం మేరకు ..ఆంధ్ర సరిహద్దు తమిళనాడు పట్టణంలో నివాసముంటున్న దినేష్ తండ్రి ధనశేఖర్ తన కుమారుడు కనిపించడం లేదంటూ రెండు నెలల క్రితం ఊతుకోట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో అక్కడ పోలీస్ అధికారులు దీనిపై విచారణ ప్రారంభించి కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా ధనశేఖర్ కుమారుడు దినేష్‌ను హత్య చేసి ఎవరికీ తెలియకుండా ఆంధ్ర సరిహద్దు సత్యవేడు మండలం చెన్నేరి గ్రామ సమీపంలో పూడ్చి వేసినట్లు తమిళనాడు పోలీసులు సమాచారాన్ని రాబట్టారు. తాగిన మైకంలో కొందరు యువకుల మధ్య ఘర్షణ ఏర్పడిన క్రమంలో యువకుడు దినేష్(20)ను హత్య చేసినట్లు తెలిపారు. దీంతో మృతదేహాన్ని గుర్తించి వెలికి తీయడానికి ఊతుకోట పోలీస్ అధికారులు సత్యవేడు సిఐ మురళి నాయక్, ఎస్ఐ రామస్వామి, రెవెన్యూ అధికారులను సంప్రదించి సమాచా రాన్ని ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎస్సై రామస్వామి, స్థానిక తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ సురేష్ అధికారుల బృందం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అదే సమయంలో ఊతుకోట సిఐ దేవరాజ్ బందం కూడా అక్కడికి చేరుకుంది. అనంతరం ప్రభుత్వ వైద్యులు, పోలీసు రెవెన్యూ అధికారుల సమక్షంలో పూడ్చిన మృతదేహాన్ని సిబ్బంది వెలికి తీశారు. అనంతరం తహశీల్దార్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని బాధిత తల్లిదండ్రులకు అప్పగించారు. తమిళనాడు ఊతుకోట డీఎస్పీ శాంతి పర్యవేక్షణలో ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

ఘనంగా టిడిపి నాయకుడి జన్మదినం

టిడిపి పట్టణ కార్యదర్శి అమరయ్యనాయుడికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని వాటర్ ట్యాంక్ సమీపం లోని ఓం శ్రీ సాయిరాం చారిట బుల్ ట్రస్ట్‌లో వృద్ధులకు టిడిపి పట్టణ కార్యదర్శి పేపళ్ల అమరయ్య నాయుడు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భం గా కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ టిడిపి నాయకులు సోమిశెట్టి చెంచురామయ్య, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బయ్యా మోహన్ రావు, సరుపూరు వెంకటేశ్వర్లు నాయుడు, పచ్చ శ్రీనివాసులు, పులిమి శివకుమార్, రాంబాబు , సద్దాం హుస్సేన్, యశ్వంత్, మోహన్ చౌదరి, సందీప్, సునీల్, ఓం ప్రకాష్, వల్లం కొండ సతీష్ కుమార్, వల్లంకొండ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం ఎంపీడీవో కార్యాలయంలో శ్రీకాళహస్తిఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి శనివారం నిర్వహించనున్న గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొనే ప్రజల సమస్యలు, వారి నుండి వినతులు స్వీకరిస్తారని, ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడివో సౌభాగ్యమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు హాజరు కావాలని ఎంపీడీవో సౌభాగ్యమ్మ కోరారు.

శంకర్ నారాయణ సేవలు అభినందనీయం

చీఫ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి- రామచంద్రాపురం: తిరుపతి పంచాయతీరాజ్ శాఖలో సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమ ణ పొందిన శంకర్ నారాయ ణ సేవలు అభినంద నీయమని చీఫ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి అన్నా రు. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శుక్రవారం ఉద్యోగ విరమ ణ వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో వివిధ హోదాలలో సమర్ధవంతంగా ఎలాంటి రిమార్కులు లేకుండా విధులు నిర్వర్తించిన వ్యక్తి శంకర్ నారాయణ అని అభివర్ణించారు. శంకర్ నారాయణను ఆదర్శవంతంగా తీసుకొని ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలన్నారు. అనంతరం శంకర్ నారాయణ దంపతులను పంచాయతీరాజ్ శాఖ అధికారులు దుశ్శాలువా, గజ పూల మాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ్మోహన్, చంద్రశేఖర్ రెడ్డి, అమరనాథ్ రెడ్డి, డిఏఓ కన్నయ్య, నీలకంఠ పాల్గొన్నారు.


కృష్ణారెడ్డి దంపతులను సన్మానించిన ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులు

ఎన్టీఆర్ పేరు చిరస్మరణీయం: ఎమ్మెల్యే

అమెరికాలో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: తెలుగు వాళ్ళు, తెలుగు నేల ఉన్నంతకాలం ఎన్టీఆర్ పేరు చిరస్మరణీయంగా ఉంటుందని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. అమెరికాలోని అట్లాంటా నగరంలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖా మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఎన్ఆర్ఐలు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహ విష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ.. గతంలో మద్రాసీలుగా పిలువబడుతున్న తెలుగు వాళ్లకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఘనత ఎన్టీఆర్ దేనని పేర్కొన్నారు. ప్రాంతీయ పార్టీ పెట్టి కేంద్రంలో ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. ఎన్టీఆర్ వారసుడిగా లోకేష్ రాష్ట్రమంతా తిరిగి యువగళం పాదయాత్ర చేసి అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. అమెరికాలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేయడం గొప్ప విషయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో సహచర ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు, కాకర్ల సురేష్, టీడీపీ ఎన్ఆర్ఐ అధ్యక్షుడు కోమటి జయరామ్ పాల్గొన్నారు.

దాహం..! దాహం..!

- మరమ్మతుకు నోచుకోని తాగు నీటి బోరు మోటారు
- పట్టించుకోని మున్సిపాల్టీ అధికారులు
- ఎంబిరోడ్‌లో మూడు నెలలుగా ఇదీ దుస్థితి

మూడు నెలలుగా నీటి చుక్క రాని కుళాయిలు

మరమ్మతుకు నోచుకోని బోరు మోటారు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో ఎంబి రోడ్డులో తాగునీటి మోటార్ మరమ్మతుకు గురి కావడంతో గత మూడు నెలలుగా తాగు నీరు సరఫరా కావడం లేదు. దీంతో ఆ వార్డు ప్రజలు తాగు నీటికి పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంబి రోడ్‌లో ఉన్న బోరు మోటరు మరమ్మతుకు గురి కావడంతో మూడు నెలలుగా ప్రజలు తాగు నీటికి నానా వస్థలు పడుతున్నారు. ఒక రోజైతే పరవాలేదు..కానీ మూడు నెలలుగా తాగునీరు అందకపోతే తమ పరిస్థితి ఏమిటి.. ఎలా?' అని ఎంబి రోడ్ వాసులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యను స్థానిక కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లినా, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమని వార్డు ప్రజలు వాపోతున్నారు. గతంలో మున్సిపాల్టీ పరిధిలో బోరు మోటారుకు మరమ్మతులు చేసిన వారికి ఒకటిన్నర లక్ష మున్సిపాల్టీ వారు బకాయి ఉండడటంతో మోటారు మరమ్మతు చేసేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదని, అందువల్ల మున్సిపాల్టీ పరిధిలో ఏ బోరు ఎ ా ా ట ా ం ు మ ర మ్మ తు ల కు గురైనా మోటార్లకు మరమ్మతు చేయడం లేదని తెలిసింది. ఇదిలా ఉంటే బోరు మోటా రుకు మరమ్మ తు చేసిన కాంట్రాక్టర్ తమకు బకాయిలు పూర్తిగా చెల్లిస్తే తామే తాగునీటి మోటారు కు మరమ్మతు చేస్తా మని అంటు న్నారు. దీంతో ఎంబి రోడ్డు వద్ద పాడైన బోరు మోటారుకు మరమ్మతులు చేసే నాథుడే కరువయ్యాడు. దీంతో ఆ వార్డు ప్రజలు తాగునీళ్ల లేక పడరాని పాట్లు పడు తున్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు మాట్లాడుతూ ఇంటి పన్ను, కుళాయి పన్ను సకాలంలో కట్టించుకుంటున్నారని, మున్సిపల్ అధికారులు ప్రజలు కష్టాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత శాఖా అధికారులు చర్యలు తీసుకుని తాగునీటి మోటారుకు మరమ్మతు చేసి ఎంబి రోడ్డు ప్రజలకు తాగు నీరు అందించాలని ఆ వార్డు ప్రజలు కోరుతున్నారు.

అట్టహాసంగా నరకచతుర్దశి వేడుకలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: టపాకాయల మోత..రంగు రంగుల వెలుగుతో మిరుమిట్లు గొలిపేలా కాంతులు... వేలాది మంది చూస్తుండగా అతి పెద్ద నరకాసురుని ప్రతిమను దహనం కార్యక్రమంతో తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నరక చతుర్దశి వేడుకలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కల్యాణ వెంకన్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో 52 రకాలతో కూడిన లక్ష 72 వేల టపాసులతో తయారు చేసిన నరకారుసుర ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 15 అడుగుల ఎత్తు, 5 అడుగుల వెడల్పుతో తమిళనాడు శివకాశి నుంచి ప్రత్యేకంగా తయారు చేసిన టపాకాయలతో రూపు దిద్దుకున్న నరకాసురుని ప్రతిమను నిపుణులైన ఏడుగురు కార్మికులు వారం రోజుల పాటు శ్రమించి తయారు చేశారు. ముందు పూజలు నిర్వహించిన తర్వాత నరకాసుర ప్రతిమ దహన కార్యక్రమాన్ని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దీపం ముట్టించి ప్రారంభించారు. దాదాపు అర్ధ గంటకు పైగా ప్రతిమలోని లక్షలాది టపాసులు వివిధ రకాలైన శబ్దాలు, వింత గొలిపే కాంతు లతో అందరిని అలరిం చాయి. ఈ కార్యక్ర మాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది జనం తరలి వచ్చారు.

నరకాసురుడి ప్రతిమను దహనం చేస్తున్న దృశ్యం

చెడుపై మంచి విజయానికి ప్రతీక:ఎమ్మెల్యే

చెడుపై మంచి విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు జరుపు కుంటున్నారని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆలయం నిర్మించిన నాటి నుంచి ఏటా దీపావళి వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ప్రత్యేకంగా 15 అడుగుల ఎత్తు, 5 అడుగుల వెడల్పుతో భారీ నరకాసుర ప్రతిమను తయారు చేశామని, అందులో 1.72 లక్షల టపాసులను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

శిథిల సమస్య..కానరాని పరిష్కారం..

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కారణమెట్ట అంగన్‌వాడీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులూడిపడుతూ పూర్తిగా కూలే దశకు చేరుకుంది. దీంతో చిన్నారులు ఏ సమయానికి ఏ ప్రమాదం ఎదురవుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో భయాందోళన మధ్య గడపాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కారణమెట్ట అంగన్‌వాడీ భవనం పురాతన భవనం.. సుమారు ముప్పై ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో కూలిపోయే దుస్థితికి చేరుకుందని గ్రామ సర్పంచి, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రంలో 20 మంది పిల్లలు చదువుకుంటున్నారు. ఒక అంగన్‌వాడీ టీచర్, ఒక ఆయా, ఒక వంట మనిషి పని చేస్తున్నారు. చిన్నారులు ఆ భవనంలో వుండడంతో పైపెచ్చులూడి పడుతూ ఏ సమయానికి ఏ ముప్పు పొంచి వుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఇప్పటికీ ఆ భవనం పై నుండి పెచ్చులు ఊడి పడతుండడంతో పిల్లలను బాగున్న స్థలంలో ఓ పక్క కూర్చోబెట్టి వారికి పౌష్టిక ఆహారం అందిస్తున్నారని అంగన్‌వాడీ కేంద్రం టీచర్ తెలిపారు. చిన్న పిల్లలను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారులు ఆ భవనానికి మరమ్మతులు చేయడమా? లేదంటే ఈ అంగన్‌వాడీ భవనాన్ని కూల్చివేసి కొత్త భవనాన్ని నిర్మిస్తే అక్కడ ఉన్న పిల్లలకు క్షేమకరంగా ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వెంటనే ఉన్నతాధికారులు ఈ భవనాన్ని పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సర్పంచ్ ద్వారా గ్రామస్తులు ఉన్నత అధికారులను అభ్యర్థిస్తున్నారు.

శిథిలావస్థకు చేరి పెచ్చులూడి పడుతున్న అంగన్‌వాడీ కేంద్ర భవనం

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నరసింహ వర్మ

బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహవర్మ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నరసింహ వర్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నరసింహ వర్మ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి కావడం గమనార్హం. ప్రస్తుతం ఆయన జువాలజీ విభాగ అధ్యాప కుడిగా పని చేస్తూ ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టారు. కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతకి కృషి చేస్తానని ఈ సందర్భంగా నరసింహ వర్మ తెలిపారు.

గడ్డివామి దగ్ధం

మంటలను అదుపు చేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని మడి బాక పంచాయతీ రాజుల కండ్రిగ గ్రామంలో పిల్లలు టపాసుల కాల్చడం వల్ల నిప్పు రవ్వలు పడి గడ్డి వామి దగ్ధమైందని సర్పంచ్ కడివల్ల చెంగల్ రాజు తెలిపారు. గడ్డివామి యజ మాని చని పోవడం, అదే రోజు గడ్డి వామి తగలబడి పోవడం చాలా బాధాకరం అన్నారు. అతనకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం చేసి న్యాయం చేయాలని కోరారు. సర్పంచ్, స్థానికుల కృష్టితో శ్రమించి మంటలను అదుపు చేశారు.

బజాజ్ బైక్‌ల అమ్మకాల్లో రికార్డ్

శ్రీ సాయిబాబా ఆటో మొబైల్స్ షోరూమ్ ఘనత

ప్రజాశక్తి -కోట : దేశీయ ద్విచక్ర వాహ నాల నిర్మాణ రంగంలో అగ్రగా మిగా బజాజ్ ఆటో లి మిటెడ్ వుంది. తిరుప తి జిల్లా కోటలోని శ్రీ సాయి బాబా ఆటో మొబైల్స్ వారు దసరా, దీపావళి సందర్భంగా అక్టోబర్ నెల అమ్మకాలలో వృద్ధి సాధించి 126 బజాజ్ బైక్‌లు సేల్స్ చేసి రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా శ్రీ సాయిబాబా ఆటోమొబైల్స్ ఎండీ ఎస్ చెంచురత్నం మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తృతీయ త్రైమాసికంలోని అక్టోబర్ నెలలో తమ సంస్థకు చెందిన మోటారు వాహనాల అమ్మకాలలో 84 శాతం వృద్ధి చెంది 126 వాహనాలను అమ్ముడుపోయాయని తెలిపారు. శ్రీ సాయిబాబా ఆటో మొబైల్స్‌కు పూర్తి స్థాయిలో సహకరించిన ఎమ్‌జిఎమ్ ఎండీ గోపాలకృష్ణకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. శ్రీరామ్ ఫైనాన్స్, హిందూజా ఫైనాన్స్, ఇండిసింద్ బ్యాంక్ ఫైనాన్స్, కస్టమర్స్ కి శ్రేయోభిలాషులకు కృతజ్ఞత అభినందనలు తెలి పారు. నెలవారీ అమ్మకాలలో ఇంతటి వృద్ధి సాధించడానికి కారణం తాము ఇటీ వల మార్కెట్లోకి ప్రవేశపెట్టిన పల్సర్ 125 సిసి నుండి 400 సిసి వాహనాలే కారణమని ఆయన వెల్లడించారు. శ్రీ సాయిబాబా ఆటో మొబైల్స్, కోట వారికి సహకరించిన ఎమ్‌జిఎమ్ ఎండీ గోపాలకృష్ణకి డీజీఎమ్ శరవణకి, ఏజిఎమ్ రంగబాబుకి మేనేజర్ ప్రదీప్, ఎమ్‌జిఎమ్ స్టాఫ్‌కి, తమ కోట బ్రాంచ్ మేనేజర్ హరికి, ఎగ్జిక్యూటివ్స్, వర్క్ షాప్ స్టాఫ్‌కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

టిడిపి కార్యకర్త హత్య బాధాకరం: ఎంఎల్ఏ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: టిడిపి కార్యకర్త హత్య బాధాకరమని ఎంఎల్ఏ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. చిల్లకూరు మండలం కడివేడులో హత్యకు గురైన గూడూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో వున్న టిడిపి కార్యకర్త వెంకటేష్ మృతదేహాన్ని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ సందర్శించారు. వెంకటేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచారు. ఎంఎల్ఏ మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇటీవల నాంచారం పేటలో హత్యకు గురైన టిడిపి కార్యకర్త ప్రసాద్ కుటుంబ సభ్యులకు పార్టీ తరపున 5 లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. ఎంఎల్ఏ వెంకట తానంకి నానాజీ, పట్టాభిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

చారిత్రక కట్టడాలను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, సానంబట్ల గ్రామంలో స్వర్ణముఖీ నది ఒడ్డున 400 ఏళ్ల నాటి శిథిల శివాలయాన్ని కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సిఈఓ, డాక్టరు ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ఎస్వీ యూనివర్సిటీ విశ్రాంత తెలుగుశాఖాధిపతి, ప్రముఖ రచయిత, పేటశ్రీ ఇచ్చిన సమాచారం మేరకు ఆయన శుక్రవారం సానంబట్ల శివారులోని సువర్ణముఖీ నది పరిసరాలను గాలించి, క్రీస్తుశకం 16,17 శతాబ్దాల నాటి ఒక ఫర్లాంగు పొడవు, అడుగున్నర వెడల్పు గల రాతికోట గోడ ఆనవాళ్లు, వరదలకు నేలమట్టమైన శివాలయ శిథిలాలను పేటశ్రీతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. చంద్రగిరి నుంచి వెంకటపతి రాయలు పాలిస్తున్నప్పుడు, ఈ ప్రాంతం అనంతరాజు ఆధీనంలో ఉండేదని, విజయనగర సైన్యం భటుల శిబిరం ఇక్కడ ఉండేదని, రాను రాను, సైన్యం భట్టుల గ్రామం సానంభట్ల అయిందని పేటశ్రీ తెలిపారు. ఇక్కడ సైనిక శిబిరం వుందనడానికి నదికి ఎడమ గట్టునున్న కోట గోడ శిథి లాలే ఆధారమని, శివాలయ ముందన టానికి, ఆలయ పునాదు లు, పడిపోయిన గోడ లు, స్తంభా లు, కప్పురాళ్లు, ఇటుక, సున్నంతో కట్టిన శిఖరం ఆనవాళ్లు తెలుపు తున్నాయని ఆలయ విడి భాగాలపై విజయ నగర కాలపు శిల్పాలు, చక్కటి నైపుణ్యానికి అద్దం పడుతున్నా యని శివనాగిరెడ్డి చెప్పారు. చారిత్రక ప్రాధాన్యత వున్న విజయనగరం కాలానికి చెందిన పడిపోయిన కోట గోడలు, ఆలయ శిథిలాలను పునరుద్ధరించి, భావితరాలకు చారిత్రాతమ్మక కట్టడాలను అందిం చాలని ఆ గ్రామ సర్పంచి ముడిపల్లి సురేష్ రెడ్డికి సానంబట్ల గ్రామస్తులకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చరిత్ర పరిశోధకులు పాములపాటి శ్రీనాథ్ రెడ్డి, ప్రకాష్, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

ఆలయ కట్టడాలను పరిశీలిస్తున్న చరిత్ర పరిశోధకులు

టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జిగా బాలాజీ శెట్టి

ప్రజాశక్తి -కోట : టిడిపికి వీర విధేయలుగా ఉన్న కోట మండలం ఉత్తమ నెల్లూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నేత పొక్కాళి బాలాజీ శెట్టిని ఉత్తమ నెల్లూరు, సిద్ధవరం, కర్లపూడి, అల్లంపాడు టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జిగా గూడూ రు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ గురువారం రాత్రి నియ మించారు. కోటలోని షాదీ మంజిల్‌లో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పరిధిలోని క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జీలు గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లకు టిడిపి సభ్యత్వం నమోదుపై కల్పించిన అవగాహన సదస్సులో ఆ పార్టీ యూనిట్ ఇన్ ఛార్జిగా పొక్కాళి పేరును ఎమ్మెల్యే ప్రకటించారు. ఆ పార్టీ ఆవిర్భావం నుండి పొక్కాళి కుటుంబం టిడిపి లో కొన సాగుతోంది. ఆనాడు నల్లపరెడ్డి కుటుంబం టిడిపితో ఉండటంతో పొక్కాళి కుటుం బం వారితో కలిసి ఆ పార్టీకి సేవలు అందించారు. సోదరులు పొక్కాళి సుధాకర్ శెట్టి, పొక్కాళి బాలాజీ శెట్టి టిడిపి వారధులుగా ఈ ప్రాంతంలో పేరు పొందా రు. అప్పట్లో ఎమ్మెల్యే బల్లి దుర్గా ప్రసాద్ రావుతో ఎంతో సన్నిహితు లుగా ఉండే వారు. ఇప్పుడు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ అదే ఆత్మీయతతో ఉన్నారు. పొక్కాళి సోదరులది సొంత గ్రామం ఉత్తమ నెల్లూరు అయినా వ్యాపా ర నిమిత్తం చెన్నైలో వుంటూ సొంత గ్రామానికి వచ్చి వెళుతుంటారు. సొంత ఊరు అభివృద్ధి కోసం నిరంతరం ఆలోచిస్తుంటారు. ఇటీవలి ఎన్నికల్లో టిడిపి విజయం కోసం అహర్ని శలు శ్రమించారు. పొక్కాళి సోదరుల సేవలను ఎమ్మెల్యే గుర్తించి వారికీ పార్టీలో మంచి గుర్తింపు వచ్చేలా కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే పొక్కాళి బాలాజీ శెట్టిని టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జ్ పదవి వరించింది.

ఎమ్మెల్యేకు పొక్కాళి కృతజ్ఞతలు

ఉత్తమ నెల్లూరు, సిద్ధవరం, కర్లపూడి, అల్లంపాడు టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జిగా పొక్కాళి బాలాజీ శెట్టిని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ నియమించడంతో బాలాజీ శెట్టి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎమ్మెల్యే ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పనిచేసి పార్టీకి మంచి పేరు తీసుకొస్తానని తెలిపారు.

దుర్గంధం..దుర్భరం..!

- పేరుకుపోయిన వ్యర్థాలు
- గోమతి దాబా వద్ద దుస్థితి
- పర్యవేక్షణ లోపమే కారణం

ప్రజాశక్తి -పెళ్లకూరు: వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. ఆ పరిసరాలు దుర్గంధ భరితంగా మారాయి. పరిసర ప్రాంత ప్రజలు ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. గోమతి ఫ్యామిలీ డాబా (రెస్టారెంట్) వద్ద పర్యవేక్షణ లోపమే దీనికి కారణమని స్థానికులు వాపోతున్నారు.

పెళ్లకూరు మండలంలోని తాల్వాయిపాడు గ్రామ పరిధిలో నాయుడుపేట సరిహద్దు పక్కనే ఇటు వెంకటగిరికి, శ్రీకాళహస్తికి, నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ కు వెళ్లే కూడలిలో గోమతి ఫ్యామిలీ దాబా (రెస్టారెంట్) వుంది. ఈ దాబా నేషనల్ హైవేకి నాయుడుపేట పట్టణ ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో నిత్యం వేల మంది ప్రజలు కాలినడకన, వివిధ రకాల వాహనాలపై అటువైపు ప్రయాణిస్తుంటారు. రోడ్డు పక్కనే దాబాకు సంబంధించి వ్యర్థ పదార్థాలను పారవేసి పట్టించుకోకపోవడంతో ఆ చెత్త బాగా కుళ్లి దాని నుంచి దుర్వాసన వస్తోంది. దాబా యాజమాన్యం, సంబంధిత అధికారులు పట్టించుకోక ఆ రహదారి వెంట వెళుతున్న ప్రయాణికులు ఇబ్బందులకు గురతున్నారు. వీరికి సంబంధించిన మరో ఏవీ రెసిడెన్స్‌లో మరుగుదొడ్ల నుంచి వచ్చే వ్యర్థాన్ని నిలువవుంచేందుకు సరిపడ సెప్టిక్ ట్యాంకులు లేకపోవడంతో ఆ వ్యర్థాన్ని చుట్టుపక్కల పొలాలలో పంపుసెట్ల సాయంతో తొలగిస్తున్నారు. సామాన్య రైతు కుటుంబాలు ఇళ్ల మధ్యలో చిన్న చిన్న పల్లపు ప్రాంతాలు, మురికి గుంటలు వున్నా వాటి వల్ల దోమలు చేరి రకరకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఇంత కాలుష్యం వున్నా సంబంధిత పట్టించుకోక స్పందించకపోవడం వెనుక కారణమేమిటని కొంత మంది ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎవరైనా అడిగితే యాజమాన్యం వారిపై అవాకులు చవాకులు పేలుతున్నారని అందుకే ఇంత జరుగుతున్నా ప్రశ్నించే వారు లేరంటున్నారు. కొంతమంది ప్రజలు, బయట పరిస్థితులు ఇలా ఉంటే ఇక హోటల్ లోపల వారికి సంబంధించిన విధివిధానాలు ఎలా ఉంటాయో అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం వుంది. అధికారుల నిర్లక్ష్యం వీడి సమస్యలు పరిష్కరిస్తారా? కాలుష్య కారకులను వెనుకేసుకొస్తారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రోడ్డుపైనే చేరిన చెత్తకుప్పలు

గోమతి దాబా వద్ద పేరుకుపోయిన చెత్తకుప్పలు

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION), TIRUPATI
O.S.NO.373/2017

Between
State Bank of India, SVIMS Branch Tirupati rep by its Branch Manager **...Plaintiff**
And
1.Sri Perugu Dasaradhi, S/o. Sri. P.Papaih and anothers **...Defendants**

SUIT SUMMONS TO THE DEFENDANT NO:3

To
M/s AMMA GUEST HOUSE rep. by its Proprietor Sri E. DHANANYA NAIDU, House No: 6-1-1106, NGO' Colony, KT Road, Tirupati Town and District

NOTICE

Sirs
Please take notice that the above suit filed against you for recovery of loan amount of Rs.1, 92, 981/-and interest and costs thereon due from you and the said suit is posted to 05-11-2024 for your appearance. If you got any objections in the above suit you can appear either in person or through an advocate on 05-11-2024 at about 10-30 AM., before the above named court and file objections if any. Failing which the matter will be decided expartee in your absence
Date of Hearing: 05-11 2024

By order of the court
PREM KUMAR KARANAM
ADVOCATE,TIRUPATI